క్లుప్తంగా

దుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు


దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం దుర్గానగర్‌లోని దుర్గమ్మ అమ్మవారి మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు మంగళగౌరీ వ్రత పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కార్పొరేటర్ సురేష్‌కు పరామర్శ


కార్పొరేటర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్‌ను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. సురేష్ అనారోగ్యానికి గురయ్యారన్న విషయం తెలుసుని ఆయన నివాసం వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు,మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ సభ్యుడు పూండి మల్లేశ్వరరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెం శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో కంచరపాలెం, జ్ఞానాపురం తాటిచెట్లపాలెం, దొండపర్తి ప్రాంతాల్లో మంగళవారం ట్రస్ట్ సభ్యులు పేదలకు చీరలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాల, సాయి, నమ్మి జ్యోతి, పండరీభాయ్, సీహెచ్ సురేష్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తుడు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో శ్రావణ మాస శుద్ధత్రయోదశి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

తెలుగు భాషకు గొడుగు.. గిడుగు

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో రామ్మూర్తి పంతులుకు నివాళి


గోపాలపట్నం బాలికల ఉన్నత పాఠశాలలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గోపాలపట్నం : తెలుగు భాషా ఉత్సవాలు పలు పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు దయానంద్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో..

జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్ హెప్సిబా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యర్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు పద్మ, రషీదా, అనిత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషోద్ధారకుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి గ్రంథాలయాధికారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వ్యవహారాలు గ్రాంథిక భాష నుంచి వాడుక భాషలోకి మారాలని కృషి చేసిన గొప్ప తెలుగు భాషోద్ధారకుడు గిడుగు రామ్మూర్తి పంతులు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు రామఅప్పారావు, బాలాజీ, వెంకటేశ్వర్లు, శ్యామ్‌కుమార్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.


గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

తెలుగు భాషోద్ధారకుడు గిడుగు

మల్కాపురం : వ్యవహారిక భాషకు గిడుగు వెంకటరామమూర్తి పంతులు ప్రాణం పోశారని, ఆయన కృషి వల్లనే తెలుగు భాష ఇన్ని కోట్ల మందికి అందుబాటులోకి వచ్చిందని ప్రముఖ చిత్రకారుడు, రచయిత సుంకర చలపతిరావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో భాషోత్సవాలు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. రాజకీయాలు, పాలన, విద్య, సాహిత్యం, సాంస్కృతిక అంశాలు అన్నీ వ్యవహారిక భాషలోనే ఉండాలని అన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.శ్రీరామ్‌మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తెలుగు భాష పట్ల ఆదరణ చూపాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన తెలుగు భాషా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది విశ్వనాథరాజు, కార్మిక సంఘం నాయకుడు బి.సత్యానందం, రచయిత కరుకు సత్తిరాజు, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

గోపాలపట్నం: ఎస్‌ఏడీ భాష్యం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి సాహితీ వేత్త గుండాన జోగారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు చిన్న సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ మణికంఠ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.


గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జోగారావు

ఆర్థిక ఎదుగుదలకు పొదుపు తప్పనిసరి

మల్కాపురం: మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే పొదుపు సూత్రాన్ని పాటించాలని ధాన్ ఫౌండేషన్ రీజినల్ కో–ఆర్డినేటర్ కె.రామ్‌కుమార్ అన్నారు.మల్కాపురం కళంజియా సమాఖ్య సర్వసభ్య సమావేశం మంగళవారం మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామ్‌కుమార్ మాట్లాడుతూ పొదుపు వల్ల ఎంతో ప్రగతి సాధించవచ్చున్నారు. మహిళలు చిన్న పరిశ్రమలు స్థాపించి పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఫెడరేషన్ కో–ఆర్డినేటర్ కె.సుభాషిణి మహిళలనుద్దేశించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, సెక్రటరీ ఆర్.రేయ్యమ్మ, ఉపాధ్యక్షురాలు నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్‌కుమార్

చురుగ్గా ప్రధాన కాలువ నిర్మాణ పనులు


మర్రిపాలెం వుడాలేఅవుట్ వద్ద జరుగుతున్న ప్రధాన కాల్వ పనులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్ ప్రధాన గెడ్డ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ నిధులు సుమారు రూ.36 లక్షలతో పనులు చేపడుతున్నారు. రిటర్నింగ్ వాల్ బోటమ్ కాంక్రీట్ పనులు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే దీర్ఘకాలంగా ఉన్న ఇక్కడి కాల్వ సమస్య తీరుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రధాన గెడ్డ మిగులు పనులకు కూడా ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో అదనపు నిధులు రూ.32లక్షలు మంజూరుకు ఆమోదం లభించింది.

రక్తదానం... మహాదానం

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి

సింధియా: ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే రక్తదానం మహాదానంతో సమానమని విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలో మంగళవారం వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఎందరికో ప్రాణం నిలబెట్టే రక్తదానాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, పిలక రామ్మోహనరెడ్డి పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

రాఖీల కొనుగోళ్ల సందడి

విశాఖ విద్య: రాఖీల కొనుగోలు దారులతో ఎస్ఏడీ కూడలి మంగళవారం సందడిగా కనిపించింది. అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమానురాగాలకు చిహ్నంగా రాఖీ పౌర్ణమి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో రాఖీ విక్రయాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఎస్ఏడీ కూడలి, బుచ్చిరాజపాలెం సెంటర్‌లో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. వివిధ ఆకృతుల్లో రాఖీలు మార్కెట్‌లో లభిస్తుండడంతో వాటి కొనుగోలుకు ఆసక్తి చూపారు.


బుచ్చిరాజపాలెం సెంటర్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

గోతులతో అవస్థలు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారిలో చిన్ని చిన్న గోతులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.పాదచారులు, వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎస్ఏడీ నుంచి గోపాలపట్నం వరకు బీఆర్‌టీఎస్ సర్వీస్ రహదారిలో గోతులు ఎక్కువగా ఉన్నాయి. బాజీ జంక్షన్ నుంచి ఈ గుంతలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ప్రధానంగా బాజీ జంక్షన్, శ్మశాన వాటిక జంక్షన్‌లో గొయ్యల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. కొన్ని వాహనాలు గోతుల్లో దిగి రాలేక పోవడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి ఈ గోతులను పూడ్చాలని కోరుతున్నారు.


గోపాలపట్నం రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

ఉక్కు క్రీడాకారులకు పతకాలు

పెదగంట్యాడ: ఈ నెల 25 నుంచి 27 వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ నగర్‌లో సెక్టార్–6 ఖాళీ బడి భవన్‌లో నిర్వహించిన 29వ జాతీయ క్రీడా పోటీల్లో పెదగంట్యాడకు చెందిన ఇద్దరు ఉక్కు క్రీడాకారులు సత్తా చాటి, పతకాలు దక్కించుకున్నారు. పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్–2023 పోటీలలో మొత్తం 300 మంది క్రీడాకారులు హాజరు కాగా.. స్టీల్‌ప్లాంట్ నీటి సరఫరా విభాగానికి చెందిన కె.ఆదినారాయణ బెంచ్ ప్రెస్‌లో రజత పతకం, డెడ్ లిఫ్ట్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. అదే విభాగానికి చెందిన ఎం.భాస్కరరావు బెంచ్ ప్రెస్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. వీరికి అక్కడి రిఫరీ రాజ్ మహావీర్ సింగ్ పతకాలు అందజేసి అభినందించారు. గాజువాక చేరుకున్న వీరికి స్థానిక క్రీడాకారులు అభినందనలు తెలిపారు.


కె.ఆదినారాయణ


ఎం.భాస్కరరావు

ఊపందుకున్న ప్రచారం

అక్కిరెడ్డిపాలెం: భెల్ గుర్తింపు సంఘం ఎన్నికలు దగ్గర పడడంతో యూనియన్ల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 31వ తేదీన జరిగే ఎన్నికల సందర్భంగా సంస్థ ప్రధాన గేటు ఎదురుగా మంగళవారం ప్రోగ్రెసివ్ ఫ్రంట్ బలపర్చిన బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్‌తోనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్యానెల్‌లో వైఎస్సార్‌టీయూసీతో భాగస్వామ్యం కలిగి ఐఎన్‌టీయూసీ, సీఐటీయూతో పాటు ఏఐసీటీయూ సమర్థవంతమైన నాయకత్వం కలిగిన యూనియన్లు ఉన్నాయన్నారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు జి.టి.పి.ప్రకాష్, ఉరుకూటి బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటక్ అఖిల భారత్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, భెల్ ఇంటక్ నాయకులు పాల్గొన్నారు.

తమ యూనియన్‌ను గెలిపిస్తే భెల్‌లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని భెల్ జేఎస్‌సీ మెంబర్ ఎస్.డి.వి.కృష్ణంరాజు అన్నారు. మంగళవారం యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కొల్లి దేముడు, పి.వి.ఎస్.రాజు, సీహెచ్.ఎస్.ఎస్.రాజు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 929వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన టీపీపీ, పీఈఎం, ఆర్ఈడీ, ఎస్ఎండీ, స్టోర్స్ తదితర విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కర్మాగారాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డులో పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. గుల్లలపాలెం ఉడాకాలనీ వద్ద పార్కు అభివృద్ధితో పాటు సామాజికభవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం జవహర్ నగర్ ప్రధాన కాలువ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.ఆయన మాట్లాడుతు గత పాలకుల మాదిరిగా తాము శిలాఫలకాలకే పరిమితి కాబోమన్నారు.అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు,నరేష్,మళ్ల ధనలత,బిల్డర్ శ్రీను,ఆడారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్

దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో పూజలు


దుర్గాలమ్మ వారికి పూజలు చేస్తున్న అర్చకులు


కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వార్డు బుచ్చిరాజుపాలెంలో వేంచేసి ఉన్న దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించారు. కుంకుమపూజ, అభిషేకం జరిపించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు లలిత సహస్రనామ పారాయణం పఠించారు. భక్తి శ్రద్ధలతో అమ్మ వారి కీర్తనలు ఆలపించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు పూరెడ్డి గురు రామరెడ్డి, కార్యదర్శి దొడ్డి జగదీశ్వరరావు, అప్పారావు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్థానికులకు ఉపాధి కల్పనకు కృషి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో మరో నూతన కార్మిక సంఘం ఏర్పాటైంది. ఇండస్ట్రియల్ ఏరియా శ్రామిక శక్తి లేబర్ వర్కర్స్ యూనియన్ పేరిట ఏర్పాటైన యూనియన్ నాయకులు మంగళవారం మల్కాపురం మరిడిమాంబ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమానికి మాజీ డిప్యూటీ మేయర్,వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ సంస్థలో జరుగుతున్న విస్తరణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలన్న ఆలోచనతో నేడు ఏర్పడిన కొత్త యూనియన్ శ్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ చైర్మన్ దాడి సత్యనారాయణ,గౌరవ అధ్యక్షుడు ఉద్దా భాస్కరరావు, అధ్యక్షుడు పెదిరెడ్ల నానాజీ, ప్రధాన కార్యదర్శి కూన చంద్రశేఖర్,కోశాధికారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్మిక సంఘ నాయకులతో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మల్కాపురం: అర్హులందరికీ పథకాలు అందేలా నాయకులు దృష్టిసారించాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. 61,62,63,40వ వార్డుల జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో మంగళవారం మల్కాపురం పల్లివీధి,గొల్లవీధి,గాంధీజీవీధి,జాలరవీధి పరిధిలోని సచివాలయాల గృహసారథులు, కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ కొణతాల సుధ మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల వార్డు పరిధిలో కొంత మందికి అర్హత ఉన్నా పలు పథకాలు అందలేదని వినతులు అందాయన్నారు. గృహసారథులు,సచివాలయాల కన్వీనర్లు వారి వివరాలు సేకరించి అర్హత ఉంటే పథకాలు వచ్చే విధంగా చొరవ చూపాలన్నారు. అలాగే పార్టీ కోసం నిబద్ధతో పని చేసే ప్రతి ఒక్కరిని గుర్తించి అవసరమైన సాయం అందేలా చూడాలన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సుధ

ఘనంగా జియ్యాని పుట్టినరోజు వేడుకలు

గోపాలపట్నం: డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం శాంతినగర్ పార్క్ జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. జియ్యాని టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై ఆయన రాజకీయ, జీవిత విశేషాలు ప్రదర్శించారు. జియ్యాని శ్రీధర్ సోదరులైన జియ్యాని విజయ్, మారుతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ కేక్ కట్‌చేసి అభిమానులకు అందించారు. కార్యక్రమంలో పాలిమేర ఆదినారాయణ, సురేష్, ప్రవీణ్, వెదుళ్ల శ్రీను, కంచిపాటి వెంకటరమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గుజరాత్ రాష్ట్రం ద్వారకలోని శ్రీకృష్ణుడి ఆలయాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఈ మేరకు తులాభారం కింద వారి నిలువెత్తు బరువుకు తగిన బియ్యం సమర్పించారు. పుట్టిన రోజు సందర్భంగా పలు ఆలయాలను దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో గుజరాత్ వెళ్లారు.


కేక్ కట్‌చేస్తున్న జియ్యాని సోదరులు, బీఎస్ కృష్ణ

మతిస్థితిమితం లేని యువతికి ఆశ్రయం

విశాఖ విద్య: రైల్వే స్టేషన్‌లో తిరుగుతున్న మతిస్థితిమితం లేని యువతిని 90 వార్డు బుచ్చిరాజపాలెంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి కేంద్రానికి మంగళవారం తరలించారు. పది రోజుల కిందట ఒడిశా నుంచి వచ్చిన యువతి రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండడాన్ని గుర్తించిన అక్కడి పోలీసులు వసతి కేంద్రం మేనేజర్ ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. ఆమె అక్కడికి వెళ్లి యవతిని వైద్యనిమిత్తం కేజీహెచ్‌కు తీసుకెళ్లి చికిత్సచేయించారు. మంగళవారం సాధారణ స్థితికి వచ్చింది.

హిందీలో మాత్రమే మాట్లాడుతుంది. తనది ఒడిశా రాష్ట్రమని, బంధువులతో ఇక్కడి వరకు వచ్చి ఉండిపోయినట్లు చెప్పింది. కుటుంబ సభ్యుల గురించి సరైన సమాధానం చెప్పలేకపోతుంది. కొన్ని రోజులు ఆశ్రమయంలోనే ఉంచి, తగిన సేవలు అందిస్తామని మేనేజర్ మమత తెలిపారు.


యువతిని ఆశ్రమానికి తీసుకొస్తున్న మేనేజర్ మమత